సాక్షి సూర్యాపేట

ఆదివారం। 5। నవంబర్। 2023



చేనేతకు చేయూతనివ్వాలి

చేనేతకు ప్రభుత్వాల నుంచి భరోసా లేదని 'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో కార్మికులు వాపోయారు. -10లో



ముగిసిన కబడ్డీ పోటీలు

ఎంజీయూలో అంతర్ కళాశాలల పురుషుల విభాగం కబడ్డీ పోటీలు శనివారం ముగిసాయి. -10లో



ప్రజల్లో చైతన్యానికే..

ప్రజల్లో రాజకీయ చైతన్యం తేవడానికే ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ అన్నారు. -10లో

న్యూస్‌రీల్

నాలుగు నియోజకవర్గాల్లో సీఎం సభలు ఖరారు

- 14న నాగార్జునసాగర్, 20న నకిరేకల్, నల్లగొండ, 21న సూర్యాపేటలో కేసీఆర్ పర్యటన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల 14, 20, 21 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు. రెండో విడతగా కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా 13వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా 14వ తేదీన నాగార్జునసాగర్, 20న నకిరేకల్, నల్లగొండలో, 21న సూర్యాపేటలో నిర్వహించే బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. ఇప్పటికే భువనగిరి, మునుగోడు, కోదాడ, తుంగతుర్తి, ఆలేరు, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండలో కేసీఆర్ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. మిగతా నాలుగు నియోజకవర్గాల్లో పర్యటన ఇప్పుడు ఖరారైంది.

ఆర్టీసీ స్వీపర్లకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

భానుపురి (సూర్యాపేట) : ఆర్టీసీలో బస్ స్టేషన్‌ను పరిశుభ్రతంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న స్వీపర్లకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యం.రాంబాబు ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్వీపర్ల వివిధ సమస్యలపై శనివారం డిపో మేనేజర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బస్ స్టేషన్, హై టెక్ బస్ స్టేషన్‌లలో పని చేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేవన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని సవరించని కారణంగా కార్మికులు, ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు, ప్రతి నెలా వేతనాలు కార్మికులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జె.నరసింహారావు పాల్గొన్నారు.

అక్రమంగా రవాణా జరగకుండా గట్టి నిఘా


- ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేట క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు, బంగారం, ఇతర వస్తువులు అక్రమంగా రవాణా జరగకుండా గట్టి నిఘా ఉంచినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలు జరగకుండా కట్టుదిట్టంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రూ. 2కోట్ల 63లక్షల 56వేల నగదు, 13లక్షల 72వేల విలువగల 2975 లీటర్ల మద్యం, 536 కేజీల నల్లబెల్లం, 200లీటర్ల నాటుసారా, 74కేజీల పటిక, రూ. కోటి 29లక్షల 11వేలు విలువ గల 283 గ్రాముల బంగారం, 145 కేజీల వెండి, రూ.38లక్షల విలువగల 148కేజీల గంజాయి, రూ. 96లక్షల 75వేలు విలువ గల వస్త్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు పట్టుకున్నట్లు వివరించారు. నియామవళి అమల్లోకి వచ్చిన రోజు నుంచి నేటి వరకు జిల్లాలో పోలీస్ శాఖ సీజ్ చేసిన వాటి విలువ రూ. 5కోట్ల 40లక్షల 22వేలు, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో రూ. 3కోట్ల విలువ గల 42800 లీటర్ల మద్యం సీజ్ చేశారు.

కాంగ్రెస్ పరిశీలకులు వీరే..

నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించింది. దేవరకొండ – రాజా వెంకటప్పనాయక్, నాగార్జునసాగర్ – చిమనకట్టి భీమసేన్, సూర్యాపేట – నారా భరత్‌రెడ్డి, మిర్యాలగూడ – యూబీ బంకర్, భువనగిరి – ప్రకాష్ హుక్కేరి, తుంగతుర్తి – సుధందాస్, ఆలేరు – శరణగౌడ పాటిల్‌ను నియమించింది.

కాంగ్రెస్ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ నియామకం



ఉత్తమ్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న కేఎల్ఎన్ ప్రసాద్

కోదాడ: కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్‌గా కోదాడకు చెందిన కేఎల్ఎన్ ప్రసాద్‌ను ఆ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాస్కీ నియమించారు. ఈ మేరకు శనివారం కోదాడలో జరిగిన ఓ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియామకపత్రాన్ని కేఎల్ఎన్ ప్రసాద్‌కు అందించారు. కోదాడ నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు కష్టపడి పని చేయాలని ఉత్తమ్ కోరారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించిన పార్టీ నాయకత్వానికి కేఎల్ఎన్ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

రెండో రోజు 28 నామినేషన్లు

హుజూర్‌నగర్‌లో నిల్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో రెండో రోజైన శనివారం 28 నామినేషన్లు దాఖలయ్యాయి. 12 నియోజకవర్గాలకు 11 నియోజకవర్గాల్లో నామినేషన్లు వేశారు. హుజూర్‌నగర్‌లో ఇంతవరకూ ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. దేవరకొండలో బీఆర్ఎస్ అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారు. కాంగ్రెస్ అభ్యర్థి నేనావత్ బాలునాయక్ తరఫున నాయకులు , మరో ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్లు వేశారు. నల్లగొండలో ఆలిండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ నుంచి ఒకరు, మరో నలుగురు ఇండిపెండెంట్లు , నాగార్జునసాగర్‌లో ముగ్గురు ఇండిపెండెంట్లు, మిర్యాలగూడలో ఇద్దరు ఇండిపెండెంట్లు, మునుగోడులో నలుగురు ఇండిపెండెంట్లు, సోషల్ జస్టిస్ ఆఫ్ ఇండియా పార్టీ నుంచి ఒకరు, నకిరేకల్‌లో ఇద్దరు ఇండిపెండెంట్లు నామినేసన్లు సమర్పించారు. తుంగతుర్తిలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఒకరు, సూర్యాపేటలో ఇండిపెండెంట్ ఒకరు, కోదాడలో ఇండిపెండెంట్లు ఇద్దరు నామినేషన్లు వేశారు.భువనగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి తరఫున నాయకులు రెండు సెట్ల నామినేషన్లు వేశారు. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ సమితి నుంచి ఒకరు, ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. ఆలేరులో విద్యార్థి రాజకీయ పార్టీ తరఫున నామినేషన్ దాఖలైంది. రెండు రోజుల్లో మొత్తం 44 నామినేషన్లు దాఖలయ్యాయి.

2వ రోజు నియోజకవర్గాల వారీగా	దాఖలైన నామినేషన్లు	ఇప్పటి వరకు మొత్తం
నల్లగొండ	5	07
కోదాడ	2	03
సూర్యాపేట	1	02
మునుగోడు	5	08
నాగార్జునసాగర్	3	04
నకిరేకల్	2	05
ఆలేరు	1	03
తుంగతుర్తి	1	02
మిర్యాలగూడ	2	04
భువనగిరి	3	03
హుజూర్‌నగర్	-	–
దేవరకొండ	3	03
మొత్తం	28	44

ఎడతెగని జాప్యం

మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను తేల్చని కాంగ్రెస్

- తుంగతుర్తి, సూర్యాపేట, మిర్యాలగూడలో వీడని ఉత్కంఠ
- రంగంలోకి దిగేదెప్పుడు.. ప్రచారం చేసుకునేదెప్పుడు..?
- తీవ్ర నిరాశలో ఆశావహులు.. గందరగోళంలో పార్టీ శ్రేణులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ మిగతా మూడు నియోజకవర్గాలపై ఇంకా తేల్చడం లేదు. దీంతో ఆశావహుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తుంగతుర్తి, సూర్యాపేట, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించకపోవడంతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ రెండు నెలల కిందటే అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించి, ప్రచారంలో దూసుకుపోతోంది. ఇప్పటికే సీఎం కేసీఆర్ 8 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ మాత్రం అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులనే ప్రకటించకపోవడంతో ఆశావహులు అయోమయంలో పడ్డారు. త్వరగా తేల్చాలంటూ ఢిల్లీ బాట పట్టారు.

సొంత అభ్యర్థులనూ తేల్చని కాంగ్రెస్

మిర్యాలగూడ వ్యవహారం పొత్తు నేపథ్యంలో గందరగోళంలో పడగా.. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో సొంత అభ్యర్థులను ప్రకటించే విషయంలోనూ కాంగ్రెస్ నాన్చుడు ధోరణినే ప్రదర్శిస్తోంది. దీంతో అక్కడ ఎవరికి టికెట్ ఇస్తారన్న అయోమయం నెలకొంది. రెండుచోట్ల కాంగ్రెస్ నుంచి ఇద్దరు చొప్పున అభ్యర్థులు టికెట్ కోసం పోటీపడుతున్నారు. సూర్యాపేటలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి పట్టుబడుతున్నారు. అక్కడ అధికార పార్టీ అభ్యర్థి, మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరోవైపు బీజేపీ కూడా ఇటీవల సంకినేని వెంకటేశ్వర్‌రావు పేరును ప్రకటించింది. ఇక తుంగతుర్తి నియోజకవర్గానికి వస్తే.. తెలంగాణ ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్ గతంలో కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈసారి కూడా అధిష్టానం తనకే టికెట్ ఇస్తుందన్న ఆశతో ఆయన ఉన్నారు. అయితే, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన కూడా తుంగతుర్తి టికెట్ కోసం పట్టుబడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇరువురిలో టికెట్ ఎవరికనేది కాంగ్రెస్ పార్టీ తేల్చడం లేదు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై.. నామిషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైనా కాంగ్రెస్ పార్టీ ఇంకా అభ్యర్థులను తేల్చకపోవడంతో ఆశావహులు ఎదురుచూపులతో కాలం గడుపుతున్నారు. అభ్యర్థుల ప్రకటన విషయంలో పార్టీ ఆలస్యం చేసిన కొద్దీ ప్రచారంలో వెనుకబడిపోతామనే ఆందోళన వారిని వెంటాడుతోంది.

పొత్తు పేరుతో నాన్చుడు ధోరణి

కాంగ్రెస్ పార్టీ రెండు విడతలుగా అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. రెండు విడతల్లో 9 నియోజక వర్గాల అభ్యర్థులను ఖరారు చేసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఇక మునుగోడు నియోజకవర్గంలో పొత్తులో భాగంగా సీపీఐకి ఇస్తామని ఒప్పందం కుదుర్చుకునే సమయంలోనే బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేరడంతో, రెండో జాబితాలో మునుగోడు స్థానాన్ని రాజగోపాల్‌రెడ్డికి కేటాయించింది. దీంతో సీపీఐ ఒంటరిపోరుకు సిద్ధమైంది. పొత్తులో భాగంగా మిర్యాలగూడ సీటు సీపీఎం కోరుకుంది. అక్కడ కాంగ్రెస్ నాయకుడు బత్తుల లక్ష్మారెడ్డి టికెట్ కోసం పట్టుబడుతున్నారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించే విషయంలో నాన్చుడు ధోరణి అవలంబించడంతో సీపీఎం.. కాంగ్రెస్‌కు గడువు పెట్టింది. ఆ గడువులోగా అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ఒంటరిగా పోటీలో ఉంటామని సీపీఎం ప్రకటించింది. అయినా ఇప్పటికీ కాంగ్రెస్‌తో చర్చలు జరుపుతూనే ఉంది. దీంతో కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ స్థానాన్ని సీపీఎంకు ఇస్తుందా..? తన అభ్యర్థినే పోటీలో నిలుపుతుందా? తేల్చడం లేదు. దీంతో అక్కడ కాంగ్రెస్ ఆశావహులతోపాటు సీపీఎం నేతలు అయోమయంలోనే ఉన్నారు.

కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేటలోని సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ స్థాయి బీఆర్టీయూతోపాటు దాని అనుబంధ సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రి జగదీష్‌రెడ్డికి మద్దతుగా భారీ సంఖ్యలో కార్మికులు తరలివచ్చి మూడోసారి సూర్యాపేట గడ్డపైన గులాబీ జెండా ఎగురవేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు బీమా సౌకర్యంతో పాటు ఇతర సంక్షేమ పథకాలన్నీ వర్తించేలా కృషి చేశామన్నారు. కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి ఆత్మగౌరవాన్ని మరింత పెంచుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో సూర్యాపేటను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అన్నారు. తద్వారా పదివేల మంది స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే సంకల్పంగా ముందుకు వెళ్తామన్నారు. గతంలో సూర్యాపేటలో వ్యాపారాలు చేసుకోవాలంటే ఎటువంటి పరిస్థితులు ఉండేవో ఒక్కసారి ప్రజలు గుర్తుకు తెచ్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, కార్మిక సంఘం నాయకులు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, చిలువేరు ప్రభాకర్, వెంపటి గురూజీ, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్, శివశంకర్, శివరాం పాల్గొన్నారు.



హాజరైన కార్మికులు

సీ-విజిల్ ద్వారా 187 ఫిర్యాదులు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

- జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సీ–విజిల్ ద్వారా అందిన 187 ఫిర్యాదులను నిర్దేశించిన సమయంలో పరిష్కరించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నోడల్ అధికారులకు కేటాయించిన విధులపై అదనపు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంకతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును 100 నిమిషాల్లో పరిష్కరించామన్నారు. ఎన్‌జీఆర్ఎస్ యాప్ ద్వారా 167 ఫిర్యాదులు రాగా 163 పరిష్కరించామని, 4 ఫిర్యాదులు పరిశీలనలో ఉన్నాయని వివరించారు. నోడల్ అధికారులు పూర్తి నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వికలాంగులు, వృద్ధులకు పోలింగ్ రోజున ఇబ్బందులు కలగకుండా ఆయా గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ట్రై సైకిళ్లతో పాటు ఆటోలను అందుబాటులో ఉంచాలని, సేవలు అందించేందుకు వలంటీర్లను ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో ఎంసీసీని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణపై త్వరలో ఓపీఓలకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలు, విద్యుత్, బారికేడ్ల ఏర్పాటుపై ఆర్అండ్‌బీ ఈఈ యాకుబ్‌కు దిశా నిర్దేశం చేశారు. నోడల్ అధికారులు ఎన్నికల నియమావళికి లోబడి తమకు కేటాయించిన విధులు సమర్థంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ సతీష్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఈఓ అశోక్, ఆడిట్ అధికారి సంతోష్, డీటీడీఓ శంకర్, డీఎస్ఓ మోహన్ బాబు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ జ్యోతి పద్మ, డీయం రాంపతి, ఎఫ్‌డీఓ రూపేందర్ సింగ్ పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

చివ్వెంల(సూర్యాపేట) : విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి దేవరాజు సూచించారు. శనివారం దురాజ్‌పల్లి శివారులోని ఎంఎస్ఆర్ సెంట్రల్ పాఠశాలలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 46 ప్రాజెక్టులు రాగా. నాలుగింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీరిలో కె.మహేందర్ (ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ దురాజ్‌పల్లి), కె.భవాని సింధు, (జెడ్పీహెచ్ఎస్, పాలవరం), జి.శ్రీలక్ష్మి, నిత్య (టీఎస్‌డబ్ల్యూఆర్ ఎస్‌జేసీ, నడిగూడెం),కె.హరిణి, సమీక్ష (సిటీ టాలెంట్ స్కూల్, సూర్యాపేట) ఎంపికయ్యారు.



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి దేవరాజు

17 వరకు టెన్త్ పరీక్ష ఫీజు గడువు

సూర్యాపేటటౌన్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఈ నెల 17వ తేదీ లోగా ఫీజు చెల్లించాలని డీఈఓ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు గతంలో ఫెయిలైన విద్యార్థులు ఫీజు చెల్లించవచ్చని సూచించారు. ఈ ఏడాది ఎంఎస్ఆర్ లేనివి, ప్రింటెడ్ నామినల్స్ రోల్స్ స్కూల్ లాగిన్‌లో విద్యార్థుల వివరాలను అప్‌లోడ్ చేసిన తర్వాత జనరేట్ అయ్యే చలాన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బ్యాంకులో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర చలాన్‌లు అనుమతించబోమని స్పష్టం చేశారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 17 వరకు చెల్లించాలని, రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 1లోగా, రూ.200 అపరాధ రుసుంతో డిసెంబర్ 11 వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 20లోగా విద్యార్థులు హెచ్ఎంలకు చెల్లించాలని సూచించారు.

50వేల మెజార్టీకి ఒక్క ఓటు కూడా తగ్గదు



పార్టీలో చేరిన వారితో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చందర్‌రావు తదితరులు

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ: 'గతంలో చెప్పాను.. మరోసారి చెబుతున్నా.. కోదాడలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ 50 వేలకు ఒక్క ఓటు తగ్గినా రాజకీయాల నుంచి తప్పుకుంటా.. బీఆర్ఎస్ పార్టీలో ఇక ఇద్దరు ముగ్గురు నాయకులు తప్పా అందరూ కాంగ్రెస్ పార్టీలో చేరడం దీనికి నిదర్శనం' అని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు నివాసంలో జరిగిన కార్యక్రమంలో కోదాడ వైస్ ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య, రెడ్లకుంట సర్పంచ్ సాధినేని లీలా అప్పారావులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. పదేళ్లుగా కోదాడ నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు చేసిన అరాచకాలు, అక్రమాలకు తెరదించడానికి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, వంగవేటి రామారావు, లక్ష్మీనారాయణరెడ్డి, మహబూబ్‌జానీ, పాండురంగారావు, మందలపు కృష్ణకుమారి, శేషయ్య, కోటేశ్వరరావు, ఆది నారాయణ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఒకటో తేదీనే వేతనాలు

హుజూర్‌నగర్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటో తేదీనే వేతనాలు, పెన్షన్లు ఇప్పిస్తామని ఎంపీ, హుజూర్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో పెన్షనర్లతో ఎన్నికల సంఘీభావ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో చెన్న సోమయ్య, కొప్పుల వీరారెడ్డి, కేవీఎస్ మూర్తి, పి. చంద్రశేఖర్, డి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కమలం నుంచి గులాబీ గూటికి 'గట్టు'

హుజూర్‌నగర్ : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గట్టు శ్రీకాంత్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



శ్రీకాంత్‌రెడ్డికి గులాబీ కండువా కప్పుతున్న మంత్రి కేటీఆర్

వరుణుడి భయం!



సూర్యాపేట నియోజకవర్గంలోని ఓ కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం

- 9వ తేదీ వరకు వర్షసూచన
- కోతకు సిద్ధంగా వేలాది ఎకరాల వరి పొలాలు
- కొనుగోలు కేంద్రాల్లోనూ పుట్లకొద్దీ ధాన్యం
- వర్షం ఏం చేస్తుందోన రైతుల్లో ఆందోళన

భానుపురి (సూర్యాపేట) : జిల్లా రైతాంగానికి వరుణుడి భయం పట్టుకుంది. ఈనెల 9వ తేదీ వరకు అక్కడక్కడా వర్షం పడే అవకాశముందని ఇటీవల రాష్ట్ర వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ సూచనలతో కోతలకు సిద్ధంగా పొలాలు ఉన్న రైతులతో పాటు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించిన వారు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వారం రోజుల్లో పొలాన్ని నూర్పిడి చేయించాలని చూస్తున్న వారికి వరుణుడు ఏం చేస్తాడోనన్న దిగులు పట్టుకుంది. ఈ క్రమంలో రైతులు వరికోతల మిషన్ల వెంట పరుగులు పెడుతున్నారు. ఒక్కసారిగా రైతాంగమంతా మాదంటే.. మాది పొలం కోయాలనడంతో కోత మిషన్లు విరామం లేకుండా నడుస్తున్నాయి.



వరుణుడి భయంతో పచ్చిగా ఉన్న పొలాన్నే నూర్పిడి చేయించుకుంటున్న రైతులు

4.50 లక్షల ఎకరాల్లో వరి

జిల్లావ్యాప్తంగా ఐదేళ్ల క్రితం వరకు హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో వరి, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలో పత్తి సాగు అధికంగా ఉండేది. అయితే ఎస్సారెస్పీ ద్వారా గోదావరి జలాల రాకతో తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లోనూ రైతాంగం అధికంగా వరి పండించేందుకే మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో సుమారుగా 4.50 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల లేకపోవడంతో ఈ విస్తీర్ణం తగ్గినట్లు తెలుస్తోంది. తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో ప్రస్తుతం పొలాలు కొంత కోతదశలో, మరికొంత కోసి కొనుగోలు కేంద్రాల్లో ఉన్నాయి. ఇక కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో కొంత కోతదశలో ఉండగా.. సన్నాల సాగు కారణంగా కోసిన ధాన్యాన్ని కోసినట్లుగా రైతులు మిల్లులకు తరలించి అమ్ముకున్నారు.

వర్షసూచనతో ...

గతంలో ఎన్నడూ లేనివిధంగా అక్టోబర్ మాసంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమయంలో వరిపొలాలతో పాటు పత్తి పంటలకు నీటి అవసరం ఉంటుంది. ఎండాకాలాన్ని తలపించేలా ఎండల తీవ్రత, ఉక్కపోతతో జనం అక్టోబర్ మాసమంతా ఇబ్బంది పడ్డారు. సరిగ్గా పంటలు చేతికి వచ్చే సమయానికి వాతావరణం మెత్తబడింది. నవంబర్ నెల ప్రారంభం నుంచే వాతావరణంలో మార్పులు వచ్చి వర్ష సూచనలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఈనెల 9వ తేదీ వరకు సూర్యాపేట జిల్లాకు వర్ష సూచనలు ఉండడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు రైతులు పదిరోజుల్లో కోయాల్సిన పొలాలను ఎక్కడా వర్షార్పణం అవుతుంతాయోనని ముందస్తుగానే కోయిస్తున్నారు. ఇక మబ్బులను చూసి ఉరుకులు, పరుగులతో కేంద్రాలకు వెళ్లి పట్టాలను కప్పుకుంటున్నారు. చివరిదశలో పంటలను వరుణుడు ఏం చేస్తాడోనని రైతులు చర్చించుకుంటున్నారు.


దేవరకొండ ఆర్‌ఓ కార్యాలయంలో శనివారం నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్


స్వతంత్ర అభ్యర్థిగా నల్లగొండ ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్

ఎన్నిక ఏదైనా.. నామినేషన్ పక్కా

1996 నుంచి చట్టసభల బరిలో ఉంటున్న మారం వెంకట్‌రెడ్డి

సూర్యాపేట: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన మారం వెంకట్‌రెడ్డి 1996 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో నామినేషన్ వేసి పోటీలో ఉన్నారు. ఈసారి కూడా ఆయన శుక్రవారం నల్లగొండ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేశారు.


నల్లగొండలో శుక్రవారం నామినేషన్ వేసిన మారం వెంకట్‌రెడ్డి

1996 నుంచి..

మారం వెంకట్‌రెడ్డి 1996లో మొదటిసారి మిర్యాలగూడ పార్లమెంట్ స్థానంలో పోటీ చేశారు. 1999, 2004లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి, 2009, 2014, 2018లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా అసెంబ్లీ బరిలో నిలిచారు. 2019లో నల్లగొండ పార్లమెంట్ స్థానానికి, అదే సంవత్సరం జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో పోటీ చేశారు. 2021లో జరిగిన నాగార్జున సాగర్ ఉప ఎన్నికలో సైతం నామినేషన్ వేసి అనారోగ్యం కారణంగా విత్‌డ్రా చేసుకున్నారు. 2022లో మునుగోడు ఉప ఎన్నికలో, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేశారు. సూర్యాపేట అసెంబ్లీ స్థానానికి ఈ నెల 6వ తేదీన నామినేషన్ వేయనున్నట్లు శనివారం ఆయన పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ నాలుగోసారి..

త్రిపురారం, నిడమనూరు: త్రిపురారం మండలం లచ్యతండాకు చెందిన ఆటో డ్రైవర్ పానుగోతు లాల్‌సింగ్ నాయక్ శనివారం నిడమనూరులోని ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. 2018 ఎన్నికల్లో మొదటిసారి నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి నామినేషన్ వేశానని, అదే విధంగా 2021లో సాగర్ ఉప ఎన్నికలో, 2022లో మునుగోడు ఉప ఎన్నికలో నామినేషన్ వేశానని, ఇప్పుడు నాలుగోసారి నామినేషన్ వేసినట్లు ఆయన పేర్కొన్నాడు. ఆటో డ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, గిరిజన తండాల్లో రాజకీయ చైతన్యం రావాలనే ఉద్దేశంతోనే స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో నామినేషన్ వేసి ప్రచారం కూడా చేస్తున్నానని చెబుతున్నాడు.


నిడమనూరు: నామినేషన్ దాఖలు చేస్తున్న పానుగోతు లాల్‌సింగ్‌నాయక్


త్రిపురారం: ఆటో నడుపుతున్న లాల్‌సింగ్‌నాయక్

పైళ్ల శేఖర్‌రెడ్డి ఆస్తుల విలువ రూ.227.78 కోట్లు

- ఆయన పేరుమీద రూ.159.50 కోట్లు..
- సతీమణి పేరుమీద రూ.68.28 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడి
- గతంతో పోలిస్తే పెరిగిన ఆస్తులు

భువనగిరి: భువనగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి ఆస్తులు గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి భారీగా పెరిగాయి. శేఖర్‌రెడ్డి తరఫున బీఆర్ఎస్ నాయకులు శనివారం భువనగిరి రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్‌ఓ) కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలలో శేఖర్‌రెడ్డి పేరు మీద మొత్తం రూ.159.50 కోట్ల విలువ చేసే ఆస్తులు ఉండగా.. ఆయన సతీమణి వనితారెడ్డి పేరు మీద రూ.68.28కోట్ల ఆస్తులు ఉన్నట్లు చూపించారు. ఇందులో ఆయన పేరు మీద రూ.120,70,33,601, ఆయన భార్య పేరిట రూ.4,36,26,517 చరాస్తులు ఉన్నట్లు ప్రకటించారు. శేఖర్‌రెడ్డి కుమార్తె పేరిట రూ.1,75,064, కుమారుడు పేరిట రూ.49,000 చరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపించారు. శేఖర్‌రెడ్డి పేరిట స్థిరాస్తులు రూ.38,80,64,800, ఆయన సతీమణి పేరిట రూ.63,92,36,495 స్థిరాస్తులు ఉన్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం శేఖర్‌రెడ్డి చేతిలో రూ.3,21,510, ఆయన సతీమణి చేతిలో రూ.9,25,138 నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. శేఖర్‌రెడ్డి పేరున రూ.90,61,17,133, ఆయన భార్య పేరు మీద రూ.22,13,96,627 అప్పులు ఉన్నట్లు చూపించారు.

2018 కంటే పెరిగిన ఆస్తులు..

2018 ఎన్నికల్లో సమర్పించిన అఫిడవిట్ ప్రకారం పైళ్ల శేఖర్‌రెడ్డి పేరున రూ.69,00,80,939, ఆయన సతీమణి పేరుమీద రూ.5,39,68,923 విలువ చేసే చరాస్తులు ఉన్నాయి. అదేవిధంగా అప్పట్లో గతంలో ఆయన పేరు మీద రూ.1,59,25,323, ఆయన సతీమణి పేరున రూ.15,03,18,620 విలువ చేసే స్థిరాస్తులు ఉన్నాయి.



- చేనేత పథకాలను మరింత సరళీకృతం చేయాలి
- చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేయాలి
- కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధి కేటాయిస్తే మేలు
- వస్త్రాలను ప్రభుత్వం మార్కెటింగ్ చేస్తే కార్మికులకు ఉపాధి దొరుకుతుంది
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో చేనేత కార్మికుల డిమాండ్


పోచంపల్లిలోని టై అండ్ డై అసోసియేషన్ భవనంలో నిర్వహించిన పీపుల్స్ ఎజెండాకు హాజరై సమస్యలు చెప్పుకుంటున్న చేనేత కార్మికులు

ఆధారం ఏదీ..

పీపుల్స్ ఎజెండా

మహ్మద్ అలీ షరీఫ్, భూదాన్ పోచంపల్లి

పోగు.. పోగును వస్త్రంగా మలిచి మనిషి మానాన్ని కాపాడేది చేనేత వృత్తి. కానీ, ఇప్పుడు నేతన్నకు విలువలేదు. నేసే బట్టకు గిరాకీ లేదు. ప్రజల నుంచి మద్దతు లేదు. ప్రభుత్వాల నుంచి భరోసా లేదు. మగ్గం నడవట్లేదు. వేరే మార్గం కనిపించడం లేదు. బతుకు సాఫీగా సాగుతలేదు. అయినా చేనేత కార్మికులు తమ వృత్తిలోనే ఉపాధి వేట సాగిస్తున్నారు. శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో భూదాన్‌పోచంపల్లిలో 'చేనేత సమస్యలు- పరిష్కార మార్గాలు' అంశంపై నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో చేనేత కార్మికులు, నాయకులు పాల్గొని వారి సమస్యలను ఏకరువు పెట్టారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నా.. అవి కార్మికులకు పూర్తిస్థాయిలో దరిచేరడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేనేత మగ్గాలు, మరమగ్గాలపై ఆధారపడి సుమారు 20వేల మందికి పైగా జీవనోపాధి పొందుతున్నారు. కానీ, చేనేత జౌళిశాఖలో సిబ్బంది కొరతతో చేనేత పథకాలపై చేనేత కార్మికులకు అవగాహన కల్పించడం లేదు. దాంతో ప్రభుత్వ పథకాలపై అవగాహన లేక వాటి ఫలాలను పొందలేకపోతున్నారు. మరోవైపు చేనేత పథకాల్లో ఉన్న సాంకేతిక సమస్యలు, కొర్రీల వల్ల పథకాలు కార్మికులకు అందని ద్రాక్షాలా మారాయి. చేనేత పథకాలను మరింత సరళీకృతం చేసి కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు. అదే విధంగా చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేయాలని, నూలు, ముడి సరుకు ధరలను నియంత్రించాలని కోరుతున్నారు. రైతుల మాదిరిగానే చేనేత కార్మికుల నుంచి ప్రభుత్వమే వస్త్రాలను కొనుగోలు చేసి మార్కెటింగ్ చేయాలని పేర్కొంటున్నారు. చేనేత రుణమాఫీ చేయాలని, హెల్త్ కార్డుల ద్వారా కార్పొరేట్ వైద్యం అందించాలని కోరుతున్నారు.


పీపుల్స్ ఎజెండాలో పాల్గొన్న చేనేత కార్మికులు, నాయకులు

చేనేత రుణమాఫీ చేయాలి



చేనేత పథకాలు బాగున్నాయి. కానీ అధికారులు వాటిపై అవగాహన కల్పిస్తలేరు. దీనికి తోడు పథకాల్లో ఉన్న నిబంధనలు కార్మికులకు గుదిబండగా మారాయి. ఏ పథకం అమలు చేసినా సరే చేనేత కార్మికుడి ఖాతాలో నేరుగా డబ్బులు పడేటట్లు చేయాలి. రైతుల మాదిరిగానే చేనేత రుణమాఫీ చేసి కార్మికులను ఆదుకోవాలి.

– మన్న యాదమ్మ, చేనేత కార్మికులు

ఎన్నికలు నిర్వహించాలి



ఎన్నికలు నిర్వహించి చేనేత సహకార సంఘాలను పటిష్టం చేయాలి. ప్రభుత్వం జిల్లాకు రూ.120 కోట్ల బడ్జెట్ కేటాయిస్తే అందులో కేవలం రూ.10.61 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. అధికారుల వైఫల్యం వల్ల ప్రభుత్వ ఫలాలను కార్మికులకు అందడం లేదు. జిల్లాలో 33 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరం.

– చింతకింది రమేశ్, చేనేత రాష్ట్ర నాయకుడు

పథకాల కింద చీరలు అందించాలి



ప్రభుత్వం నేరుగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఆర్థిక సాయంతోపాటు పట్టుచీరె, పట్టు దోవతి ఇవ్వాలి. జియోట్యాగింగ్ మగ్గం కల్గిన ప్రతి చేనేత కార్మికుడికి నేరుగా రూ.3వేలు ఇవ్వాలి. అలాగే చేనేత సహకార సంఘాలకు క్యాష్‌క్రెడిట్ ఇచ్చి సంఘాలను పటిష్టం చేయాలి.

– భూషణ్, చేనేత కార్మిక సంఘం డైరెక్టర్

పథకాలను సులభతరం చేయాలి



చేనేత పథకాలు పొందాలంటే అనేక నిబంధనలు పెట్టారు. నూలు సబ్సిడీ బిల్లులు సక్రమంగా వస్తలేవు. బ్యాంకు అకౌంటుకు ఆధార్‌లింక్ లేదని చేనేత మిత్ర పథకం కింద మగ్గానికి ఇచ్చే రూ.3 వేలు అందరికీ అందడం లేదు. చేనేత పథకాలను సులభతరం చేసి అర్హులందరికి అందజేయాలి. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా నాలుగేళ్లుగా కార్మికులకు నేతకూళ్లు పెంచలేదు.

– కర్నాటి పురుషోత్తం, చేనేత జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు

బీమా అమలు చేయాలి



నేతన్న బీమా వయస్సును 59 సంవత్సరాల నుంచి 75 సంవత్సరాల వరకు పొడిగించాలి. నూలు సబ్సిడీ, థ్రిఫ్ట్, చేనేత మిత్ర పథకాలను అర్హులందరికీ అందజేయాలి. చేనేత జౌళిశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగులను భర్తీ చేయాలి. పోచంపల్లిలో చేనేత అధికారి కార్మికులకు అందుబాటులో ఉండేలా చూడాలి.

– మునునూరి యాదగిరి, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు

షోరూమ్‌లు ఏర్పాటు చేయాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ప్రముఖ నగరాలు, పట్టణాల్లో షోరూమ్‌లు ఏర్పాటు చేసి మార్కెటింగ్ చేయాలి. దానివల్ల కార్మికులకు ఉపాధి మెరుగవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వర్క్‌షెడ్ పథకం, నూలు సబ్సిడీని సక్రమంగా అమలయ్యేలా చూడాలి.

– బోడ దయానంద్, చేనేత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు

పార్కును వినియోగంలోకి తేవాలి



పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును త్వరగా వినియోగంలోకి తీసుకరావాలి. ఇక్కడి కార్మికులకు చేతినిండా పని కల్పించాలి. అలాగే చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్ వద్ద పేరుకుపోయిన వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

– బేతి మధుసూదన్, చేనేత డిజైనర్

హెల్త్‌కార్డులు అందజేయాలి



ప్రభుత్వం చేనేత కార్మికులకు హెల్త్‌కార్డులను అందజేయాలి. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అన్ని ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలి. చేనేత కార్మికులకు రూ.5 లక్షలతో గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలి.

– గజ్జెల రామకృష్ణ, చేనేత కార్మికుడు

చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. నిష్ణాతులైన చేనేత కార్మికులు, కళాకారులు నిలదొక్కుకునేందుకు ఆర్థిక సాయం అందించాలి. ఆంధ్రప్రదేశ్ మాదిరిగానే తెలంగాణలో కూడా చేనేత కార్మికులకు వర్క్‌షెడ్ పథకాన్ని, పక్కా ఇళ్లు, నేరుగా కార్మికుడికి రూ.24 వేలు ఇవ్వాలి.

– భోగ రఘు, చేనేత కళాకారుడు

నూలు కేంద్రం ఏర్పాటు చేయాలి



పోచంపల్లిలో నూలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. పెరుగుతున్న నూలు, రంగులు, రసాయన ధరలను నియంత్రించాలి. ఫిక్స్‌డ్ ధరను నిర్ణయించి కార్మికులకు నూలును అందించాలి. నూలు సబ్సిడీ నెలనెలా అందించాలి.

– శ్రీనివాస్, చేనేత పరిరక్షణ సమితి నాయకుడు

హ్యాండ్లూమ్ కోర్సులను ప్రవేశపెట్టాలి



డిగ్రీ కళాశాలల్లో హ్యాండ్లూమ్ డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టాలి. చేనేత డిజైన్‌లపై కార్మికులకు శిక్షణ ఇవ్వాలి. చేనేత వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరికి గుర్తింపుకార్డులు ఇచ్చి, వారి జీవన ప్రమాణాలు పెంచాలి. చేనేత కార్మికుల పిల్లలకు ఉచితంగా కేజీ టూ పీజీ విద్యనందించాలి. రైతుల మాదిరిగానే చేనేత బంధు పథకాన్ని అమలు చేయాలి.

– గంజి యుగేందర్, ఇక్కత్ వరల్డ్ అధినేత

రిజర్వేషన్ యాక్ట్‌ను కాపాడాలి



11 రకాల చేనేత వస్త్రాలకు ఉద్దేశించిన రిజర్వేషన్ యాక్టును 9వ షెడ్యూల్‌లో చేర్చి నకిలీ వస్త్రాల తయారీని నిరోధించాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ యాక్ట్‌ను కాపాడాలి. చేనేత సహకార సంఘాల యాక్ట్‌లో ఉన్న షేర్ క్యాపిటల్ విధానాన్ని ఎత్తివేసి వృత్తి క్యాపిటల్ విధానాన్ని ప్రవేశపెట్టి ఎన్నికలు నిర్వహించాలి.

– మిర్యాల కృష్ణమూర్తి, చేనేత నాయకుడు

రూ.1.70లక్షలు, మద్యం సీజ్

నల్లగొండ: ఎన్నికల తనిఖీల్లో భాగంగా శనివారం నల్లగొండ జిల్లాలో రూ.1.70లక్షలతో పాటు ఇతర వస్తువులను పోలీసులు సీజ్ చేశారు. అదేవిధంగా 8,489 లీటర్ల లిక్కర్‌ను కూడా పట్టుకున్నారు. పట్టుబడిన నగదు, వస్తువులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపలేదని పోలీసులు తెలిపారు. మొత్తంగా 60 కేసులు నమోదు చేసి 14 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

పెద్దఅడిశర్లపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి మండలం చిల్కమర్రి గ్రామానికి చెందిన ఇరిగి నాగార్జున(27) కొండమల్లేపల్లిలో ఇంటర్నెట్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగా శుక్రవారం రాత్రి షాప్ మూసివేసి తన బాబాయి వెంకటయ్యతో కలిసి బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తుండగా చిల్కమర్రి గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగార్జున తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి బాబాయి వెంకటయ్యకు కూడా తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

డీఎస్పీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

మిర్యాలగూడ టౌన్: ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) అధికారంలోకి వస్తే కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ తెలిపారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌టీఆర్ఎస్ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద రోడ్డు షో నిర్వహించారు. మిర్యాలగూడ డీఎస్పీ అభ్యర్థిగా తరి ఎల్లయ్యను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు డీఎస్పీ అభ్యర్థిని గెలిపించి అసెంబ్లీకి పంపించాలన్నారు. అనంతరం పార్టీ మేనిఫెస్టోను వివరించారు. తెలంగాణలో కాన్షీరాం పొలిటికల్ లీడర్‌షిప్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం నాలుగు లక్షల మంది ఉద్యోగాలు కల్పిస్తామని, మహిళలకు ఎలక్ట్రానిక్ పరికరాల తయారీపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. మాదిగలకు 12శాతం రిజర్వేషన్లతో కూడిన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని కేంద్రంపై పోరాడి సాధిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజశేఖర్ మహరాజ్, వివిధ మండలాల అధ్యక్షులు వెంకటేష్, నగేష్, సైదులు, కళ్యాణ్ పాల్గొన్నారు.


మిర్యాలగూడలో తరి ఎల్లయ్యను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న విశారదన్ మహరాజ్

ప్రజల్లో చైతన్యం కల్పించేందుకే..

రామగిరి(నల్లగొండ): బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాల ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించేందుకే డీఎస్పీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని విశారదన్ మహరాజ్ అన్నారు. శనివారం నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గ అభ్యర్థి పుల్లెంల శంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, జిల్లా కార్యదర్శి రవి, వినోద్, వంశీ, దినేష్ పాల్గొన్నారు.

వంగాల స్వామిగౌడ్‌కు నివాళి


నెమలికాల్వలో స్వామిగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

వలిగొండ: మండలంలోని నెమలికాల్వకు చెందిన సీనియర్ నాయకుడు వంగాల స్వామిగౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. శనివారం ఆయన స్వగ్రామంలో దశదిన కర్మ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారిలో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి వంగాల కిరణ్‌కుమార్‌రెడ్డి, వంగాల ఈశ్వరయ్యగౌడ్, చక్రవర్తిగౌడ్, చెరుకు సుధాకర్, తండు సైదులుగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ పైళ్ల రాజవర్ధన్ రెడ్డి, వంగాల వెంకన్న, తుమ్మల వెంకట్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, గూడూరు శివశాంత్ రెడ్డి, గూడూరు శ్రీధర్ రెడ్డి, కొమిరెల్లి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో జారిపడి వృద్ధుడు మృతి


రామచంద్రు (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట): ఎస్సారెస్పీ కాలువలో జారిపడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలంలోని పులితండా ఆవాసం బద్యాతండాకు చెందిన ధరావతు రామచంద్రు(70) తన వ్యవసాయం పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తూ లక్ష్మణ్‌నాయక్ గ్రామ శివారులో ఎస్సారెస్పీ కాలువ దాటేందుకు వేసిన తాటిమొద్దుపై నుంచి నడుచుకుంటూ వస్తుండగా కాలుజారి కాలువలో పడిపోయాడు. దీంతో కాలువలో రెండు కిలోమీటర్ల మేర కొట్టుకుపోయి సేవాలాలత్‌తండా ఆవాసం బులాకితండా వద్ద ఉన్న తూము వద్ద చిక్కుకుపోయాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు విషయం తెలియజేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

డెంగీ లక్షణాలతో మహిళ మృతి


భాగ్యమ్మ (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): డెంగీ లక్షణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ శనివారం మృతిచెందింది. వివరాలు.. ఆత్మకూర్(ఎస్)మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామానికి చెందిన సారగండ్ల భాగ్యమ్మ (55) వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. శుక్రవారం జ్వరం తీవ్రంగా ఉండడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె బీపీ, రక్తకణాలు పడిపోవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.